క్లుప్తంగా

డయల్ యువర్ డీఎం

మధిర: మధిర డిపోలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఫిబ్రవరి 1 నుంచి ఉదయం 7:45 గంటలకు మధిర నుంచి హైదరాబాద్ ప్రగతినగర్‌కు సూపర్ లగ్జరీ సర్వీస్ ఏర్పాటు చేస్తున్నట్లు డీఎం తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

చింతకాని: మండలంలోని నాగులవంచకు చెందిన మార్కపూడి సరస్వతికి మంజూరైన రూ.21 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న నాయకులు

కొణిజర్ల: పంచాయతీకి ఇంటి పన్ను బకాయిలు చెల్లించొద్దంటూ బీఆర్ఎస్ నాయకులు టమకా వేయిస్తున్నారని కొణిజర్ల సర్పంచ్ సూరంపల్లి రామారావు అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అయితే, బీఆర్ఎస్ నాయకుడు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నోటీసు వచ్చాకే కట్టాలని చెప్పానే తప్ప, అసలు కట్టొద్దని చెప్పలేదన్నారు.

మత్స్య సొసైటీ మాజీ చైర్మన్‌కు నివాళి

వైరా: వైరాకు చెందిన మత్స్య సహకార సొసైటీ మాజీ అధ్యక్షుడు, మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు బీబా సాహెబ్ తండ్రి షేక్ లతీఫ్ మంగళవారం మృతి చెందారు. ఈ మేరకు ఎమ్మెల్యే రాములునాయక్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ నివాళులర్పించారు. ఇంకా పలువురు సంతాపం ప్రకటించారు.

జూనియర్ కాలేజీకి వితరణ

కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎంసెట్ మెటీరియల్ కొనుగోలుకు పర్సా ట్రస్ట్ చైర్మన్ పర్సా పట్టాభిరామారావు రూ.15వేలు మంగళవారం ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలానికి అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం..



అల్పాహారం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

వైరా: వైరా లయన్స్‌క్లబ్ వారు చేపట్టిన మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా వైరా ఐదవ వార్డు గండగలపాడులో అల్పాహారాన్ని అందజేశారు. దాత నంబూరి మధు, కౌన్సిలర్ కర్నాటి నందిని, క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, బుచ్చిరామారావు, రమేష్, పాల్గొన్నారు.

3న బీజేపీ కార్యాలయం ప్రారంభం

మధిర: పట్టణంలోని వైరా రోడ్డులో ఈనెల 3న బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్లపల్లి విజయరాజు, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు తెలిపారు. పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడగా పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

ఏన్కూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బయ్యారపు అశోక్‌ను మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మంగళవారం సన్మానించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎంపీడీఓ అవార్డు అందుకున్న సందర్భంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

ఆర్టీసీ సేవలపై అవగాహన

ఏన్కూరు: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. మండలకేంద్రంలో మంగళవారం సాంబయ్య, శంకర్, వెంకటస్వామి, శ్రీనివాస్, ఎల్లాస్వామి కుమార్, శ్రీను, సీఆర్‌సీ సామ్యూల్ ఆధ్వర్యాన ప్రదర్శన ఇచ్చారు.

మట్టా దయానంద్‌కు షర్మిల పరామర్శ



దయానంద్‌ను పరామర్శిస్తున్న షర్మిల

సత్తుపల్లి: గుండెపోటు సంబంధిత ఇబ్బందులతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న సత్తుపల్లికి చెందిన నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌ను వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల మంగళవారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి దయానంద్ ఆరోగ్య వివరాలు తెలుసుకున్న ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పాఠశాలలకు మహర్దశ

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులకు హంగులు

- రంగులు, సౌకర్యాల కల్పనతో కొత్త అందం
- నేడు ఎంపిక చేసిన పాఠశాలల ప్రారంభం



రంగులు వేసిన ఆళ్లపాడు పాఠశాల భవనం



వాటర్ ట్యాంకు, నల్లాలు



తరగతి గదిలో డ్యూయల్ డెస్క్ బెంచీలు

బోనకల్: ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాల కల్పనకు మన ఊరు–మన బడి పథకాన్ని ప్రవేశపెట్టగా, మండలంలో పది పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో ఆళ్లపాడు, కలకోట ప్రాథమిక పాఠశాలలు మోడల్ స్కూళ్లుగా గుర్తించి తొలి దశలో పనులు చేపట్టారు. ఒక్కో పాఠశాలకు రూ.10లక్షలకు పైగా నిధులు మంజూరు చేసి మైనర్ పనులు, విద్యుత్ సౌకర్యం, వాటర్ ట్యాంకు, శానిటేషన్ పనులు పూర్తి చేయించడమే కాక ప్రహరీ, భవనం, గదుల్లో రంగులు వేయించడంతో కొత్త అందాలు సంతరించుకున్నాయి. కాగా, తొలిదశలో చేపట్టిన పనులు పూర్తయినా పాఠశాలలను బుధవారం ప్రజాప్రతినిధులు ప్రారంభించనున్నారు.

సకల సౌకర్యాలు..

పాఠశాలల్లో అన్ని గదులకు కొత్తదనం వచ్చేలా ఆకట్టుకునే విధంగా రంగులు వేయించారు. అలాగే, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అమర్చారు. అలాగే, ప్రతీ తరగతి గదిలో ఇద్దరేసి విద్యార్థులు కూర్చునేలా డ్యూయల్ డెస్క్ బల్లలు సమకూర్చారు. ఒక్కో బెంచీకి దాదాపు రూ.15 వేల వరకు వెచ్చించినట్లు అంచనా. కాగా, మోడల్ స్కూళ్లగా ఎంపిక చేసి పనులు చేసిన ఆళ్లపాడు, కలకోట ఎస్సీ కాలనీ పాఠశాలలను బుధవారం ప్రజా ప్రతినిధులు లాంఛనంగా ప్రారంభిస్తారు. మన ఊరు–మన బడి పథకం పనులపై కలెక్టర్ పీ.వీ.గౌతమ్ ప్రత్యేక దృష్టి సారించడమే కాక.. తరచుగా పర్యవేక్షిస్తూ అధికారులు, ఎస్ఎంసీ చైర్మన్లు, సర్పంచ్‌లకు సూచనలు చేయడంతో ప్రభుత్వ పాఠశాలలు కొత్త అందం సంతరించుకున్నాయి.

పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది



పాఠశాల వాతావరణం ఇప్పుడు ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. మన ఊరు–మన బడి పథకం కింద పాఠశాలలో కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పించారు. విద్యార్థులు కూర్చునేందుకు ఇచ్చిన డ్యూయల్ డెస్క్ బెంచీలు, ఇతర సౌకర్యాలతో పాఠశాల కార్పొరేట్‌కు దీటుగా మారింది.

– మర్రి తిరుపతిరావు, సర్పంచ్, ఆళ్లపాడు

విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు..



మా పాఠశాల మన ఊరు–మన బడి పథకం కింద ఎంపిక కాగా పనులన్నీ పకడ్బందీగా చేయించాం. అన్ని సౌకర్యాలు ఉండటంతో ప్రభుత్వ బడిలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు మైనర్ రిపేర్లు చేయించడమే కాక ఫర్నీచర్ సమకూర్చారు.

– కందుల పాపారావు, ఎస్ఎంసీ చైర్మన్, ఆళ్లపాడు

కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు



మన ఊరు–మన బడి పథకం కింద మా పాఠశాల ఎంపిక కావడం వరం వంటిది. గతంలో సౌకర్యాల కోసం దాతలను ఆశ్రయించేవాళ్లం. కానీ ఇప్పుడు ప్రభుత్వమే నిధులు సమకూర్చి అన్నిరకాల వసతులతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దింది. విద్యార్థులంతా ప్రభుత్వ బడిలోనే చేరాలి.

– సీహెచ్.రవికుమార్, ఉపాధ్యాయులు, ఆళ్లపాడు

'ప్రజా నాయకుడు పొంగులేటి'



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

మధిర: ప్రజల ఆశీస్సులతో రాజకీయాల్లోకి వచ్చి, ప్రజాక్షేత్రంలోనే గెలుపొందిన నాయకుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అని బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ కోట రాంబాబు తెలిపారు. మధిరలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోనకల్‌లో ఇటీవల నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరై శ్రీనివాసరెడ్డికి అండగా ఉంటామని ప్రకటించిన నాయకులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, పొంగులేటిపై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో పార్టీ అభ్యర్థులను గెలిపించిన సత్తా పొంగులేటికి మాత్రమే ఉండగా, కేటీఆర్ ఆదేశాలతో రెబల్స్ అభ్యర్థులను తప్పించి మధిర మున్సిపాలిటీ బీఆర్ఎస్ వశమయ్యేలా కృషి చేశారని గుర్తు చేశారు. రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడు మందడపు తిరుమలరావు మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి ప్రత్యక్ష ఎన్నికల్లో సత్తా చాటారే తప్ప ఎమ్మెల్సీ మధు మాదిరి పరోక్షంగా పదవులు దక్కించుకోలేదని తెలిపారు. జెడ్పీటీసీ శీలం కవిత, నాయకులు ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, ఎర్రగుంట రమేష్, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, తూమాటి అనంతరెడ్డి, గోళ్ల ఉద్దండు, శ్రీనివాసరావు, అక్కినపల్లి నాగేశ్వరరావు, చిలకా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు దేశసంపద

చింతకాని: మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధిపొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ మండల కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ.. దేశంలో విభజన రాజకీయాలు చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందరావు, రవీంద్రబాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు దూసరి శ్రీరాములు, పగిడిపల్లి ఏసు, రాసాల మోహన్‌రావు, రవి, కన్నెబోయిన విజయమ్మ, మండల కార్యదర్శి మల్లికార్జున్‌రావు, సహాయ కార్యదర్శులు దూసరి గోపాలరావు, మహేష్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం

ఏన్కూరు: మండల పరిధిలోని తూతకలింగన్నపేట, సూర్యతండ, మర్సకుంట, నెమలిపురిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్యసమావేశం నిర్వహించారు. సమస్యపై అధికారులకు ఫోన్ చేసిన స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు నివేదికలు చదువుతుంటే ప్రజాప్రతినిధులు వారిని నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరెం వరలక్ష్మీ, తహసీల్దార్ ఎస్‌కె.ఖాసీం, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఎంపీటీసీ లచ్చిరాం, సర్పంచ్‌లు వీరభద్రం, జొగా భిక్షమమ్మ, కృష్ణప్రియ, భూక్య శివ పాల్గొన్నారు.

కిచెన్‌గార్డెన్ ఏర్పాటుపై శిక్షణ

వైరారూరల్: మండలంలోని ఖానాపురం రైతు వేదికలో 2018/19 ఏడాదిలో వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న ఖానాపురం, కొండికొడిమ గ్రామాల ఉపాధి హామీ కూలీలకు మంగళవారం డీఆర్డీఏ, వైరా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వర్మీ కంపోస్టు, కిచెన్ గార్డెన్ తయారీ విధానంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. డీఆర్డీఏ కార్యాలయ సిబ్బంది గాలయ్య, రేవతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షేక్.లాల్ మహ్మద్, ఏఈఓ సైదులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలి

ముదిగొండ: రైతులు పొలాలకు వెళ్లడానికి, రాకపోకలు సాగించడానికి జాతీయ రహదారిపై అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని వెంకటాపురం, చిరుమర్రి గ్రామాలకు చెందిన రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. రైతులు అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరడంతో వెంకటాపురం, చిరుమర్రి రహదారిని మంగళవారం తహసీల్దార్ శిరీష పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వహీదా, సిబ్బంది, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

కారేపల్లి: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ చేపట్టవచ్చునని కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు తెలిపారు. మంగళవారం కారేపల్లి మండలం పాటిమీదిగుంపు పంచాయతీ ఆధ్వర్యంలో నాలుగు కమ్యూనిటీ సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు తమ పంచాయతీ కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాణోతు శంకర్, ఉప సర్పంచ్ సోమ్లా, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

బోనకల్: మండలంలోని గోవిందాపురం (ఏ) గ్రామంలోఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతం అయింది. డాక్టర్ రాంప్రసాద్ వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.సర్పంచ్ బాగం శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ పద్మావతి, ఫార్మసిస్ట్ హాలీమియా పాల్గొన్నారు.

బుద్ధ విగ్రహం ఆవిష్కరణ

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రాంగణంలో మంగళవారం బుద్ధుని విగ్రహాన్ని సర్పంచ్ మొగిలి అప్పారావు, ఎంఈవో వై ప్రభాకర్, ఎస్సై ఎం.సురేష్, పాఠశాల సూపరింటెండెంట్ కె.సరిత ఆవిష్కరించారు. బుద్ధఫౌండేషన్ సభ్యులు పి.సుఖేష్, మల్లిఖార్జున్‌రావు, విమలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటికీ జమకాని ధాన్యం డబ్బులు..

తల్లాడ: మండల పరిధిలోని మిట్టపల్లి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి 45 రోజులవుతున్నా నేటి వరకు డబ్బులు జమ కాలేదని రైతు సంఘం నాయకులు ఆపతి వెంకటరామారావు, గోపిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మిట్టపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో మంగళవారం వారు మాట్లాడగా సర్పంచ్ మాగంటి కృష్ణయ్య, రైతులు శ్రీనువాసరావు, నరసింహారావు, శ్రీను, మీర్జా మహబు, వెంకటేశ్వర్లు, తిరుపతిరావు, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలతో మరింత భారం

విద్యుత్ వినియోగదారులపై ఏసీడీ పేరుతో పేదలపై మరింత భారం మోపుతున్నారని, ఏసీడీ చార్జీలను తొలగించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ నాయకులు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వద్ద మంగళవారం ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి సబ్‌స్టేషన్ వద్ద ధర్నా..



చింతకానిలో..



ఏన్కూరులో..

ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం



చెక్కు అందజేస్తున్న కమల్‌రాజ్, నాయకులు

చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను జెడ్పీ చైర్మన్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మీ పథకం పేద కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందని, ఆడబిడ్డల వివాహాలకు పెద్దన్నగా నిలబడి సహాయం చేస్తున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని 84 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాధికా గుప్తా, జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతురావు, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు మంకెన రమేష్, గ్రామసర్పంచ్ బండి సుభద్ర, తహసీల్దార్ మంగీలాల్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి బొడ్డు వెంకట్రామయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలపాలిట వరం సీఎం సహాయ నిధి



తల్లాడ: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర

తల్లాడ/కల్లూరురూరల్/సత్తుపల్లి రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు ఖరీదైన చికిత్స చేయించుకునేలా ప్రవేశపెట్టిన సీఎం సహాయనిధి పథకం పలువురికి వరంలా నిలుస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన 13 మందికి రూ.4.98 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వాన దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పలువురి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డితో పాటు దూపాటి భద్రరాజు, డి.వెంకట్‌లాల్, దిరిశాల దాసురావు, శీలం కోటారెడ్డి, కోసూరి నరసింహారావు పాల్గొన్నారు. అలాగే, కల్లూరులో ఏర్పాటుచేసిన సమావేశంలో 25మందికి రూ.10.85లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 14మందికి కల్యాణలక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే వెంకటవీరయ్య అందజేశారు. తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎంపీపీ బీరవెల్లి రఘు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్‌తో పాటు పాలెపు రామారావు, ఎండీ.ఇస్మాయిల్, లక్కినేని రఘు, చందర్‌రావు, బోబోలు లక్ష్మణ్‌రావు, కొరకొప్పు ప్రసాద్ పాల్గొన్నారు. కాగా, మణుగూరులో గోదావరి వద్ద గల్లంతై మృతి చెందిన సత్తుపల్లి మండలం సత్యంపేటకు చెందిన సింహాద్రి శ్రీనివాసరావు(42) మృతదేహం వద్ద ఎమ్మెల్యే సండ్ర నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌తో పాటు పిడుగు వెంకటేశ్వరరావు, ఎస్‌కే.చాంద్‌పాషా, తడికమళ్ల ప్రకాశరావు, మదీనాపాషా, చిల్లగుండ్ల వెంకటేశ్వరరావు, కోటి, అబ్దుల్లా, ఎస్‌కే.జిన్నీ, జానీ పాల్గొన్నారు.

దుకాణాలు తొలగించాలి

సాక్షి ఎఫెక్ట్..

సత్తుపల్లిటౌన్: షాపింగ్‌మాల్స్, బహుళ అంతస్తుల భవనాల్లోని సెల్లార్లలో ఉన్న దుకాణాలను వారంరోజుల్లోగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కె.సుజాత ఆదేశాలు జారీ చేశారు. 'అడ్డగోలుగా నిర్మాణాలు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. పట్టణంలోని షాపింగ్‌మాల్స్‌లోని సెల్లార్‌లలో ఉన్న దుకాణ యజమానులకు టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, బిల్‌కలెక్టర్ శ్రీనులు వెళ్లి నోటీసులు అందించారు. సెల్లార్‌లలో వాహనాల పార్కింగ్‌కు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. ఖాళీ చేయకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బస్‌పాస్‌ల పంపిణీ

తల్లాడ: ఆర్టీసీ అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ సత్తుపల్లి డిపో మేనేజర్ ఎం.రాజ్యలక్ష్మీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారెళ్ల మమత, తోట శ్రీనువాసరావు, పంచాయతీ కార్యదర్శి వేణు, సూదా శేషగిరి, ఆర్టీసీ ఏడీసీ పీవీ రావు, కిన్నెర ఆనందరావు, సుంకర రమేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'

మధిర: మండలంలో పలుచోట్ల మంగళవారం కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. పీహెచ్‌సి వైద్యాధికారులు వెంకటేష్, పృథ్వీ నాయక్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు.

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీ, బుగ్గపాడు కంటి వెలుగు కేంద్రాలను జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి డాక్టర్ శ్రీధర్, ప్రవీణ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.సీతారాంలు పరిశీలించారు. వైద్యులు అవినాష్, అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

కల్లూరు రూరల్: పేరువంచ పంచాయతీలో నిర్వహిస్తున్న కంటివెలుగు వైద్య శిబిరాన్ని ఎంపీపీ బీరవెల్లి రఘు, ఎంపీడీఓ రవికుమార్, డాక్టర్ నవ్యకాంత్ పరిశీలించారు.

కారేపల్లి: మండల పరిధిలోని బాజుమల్లాయిగూడెం గ్రామంలో కంటి వెలుగు ముగిసింది. సర్పంచ్‌లు కోరం కోటమ్మ, అజ్మీర నరేష్, ఉప సర్పంచ్‌లు దుద్దుకూరి ఉషారాణి, భాగం వెంకటప్పారావు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

చింతకాని: కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా సూచించారు. మండలంలోని పందిళ్లపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, డాక్టర్ అలీతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.